సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 20 । మార్చి । 2023




**మహావీర్ మ్యూజియానికి మంచి రోజులు**

కడపలోని భగవాన్ మహావీర్ మ్యూజియంకు మంచిరోజులు రానున్నాయి. - 8లో



**సిద్దయ్య మఠం ఉత్సవాలకు ముస్తాబు**

పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియ శిష్యుడు సిద్దయ్యస్వామి కొలువైన మఠం ఉత్సవాలకు ముస్తాబు అవుతోంది. - 8లో

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 34.3/21.9

జిల్లాలో ఆదివారం 21.9 - 34.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

# దెబ్బమీద దెబ్బ

- అకాల వర్షంతో రైతన్నకు కోలుకోలేని నష్టం
- గాలులు, వర్షంతో నేలకొరిగిన ఉద్యాన, వ్యవసాయ పంటలు
- జిల్లాలో 866.85 హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- రూ. 2 కోట్లకు పైగా ఉద్యాన పంటలకు నష్టం
- 535 హెక్టార్లలో దెబ్బతిన్న వ్యవసాయ పంటలు



ముద్దనూరు మండలంలో నేలకొరిగిన జొన్న పంట



పెండ్లిమర్రి : దెబ్బతిన్న అరటితోట

**కడప అగ్రికల్చర్:** జిల్లాలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో ఉద్యాన, వ్యవసాయ రైతులకు అపార నష్టం వాటిల్లింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి పంటలు నష్టపోయిన రైతులు కోలుకోకముందే మళ్లీ దెబ్బపడటంతో కుంగిపోతున్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలకు సంబంధించి పంట దిగుబడి చేతికొచ్చే సమయంలో జిల్లాలోని పలు మండలాల్లో అరటి, నిమ్మ, మామిడి, బత్తాయి, తమలపాకు, కర్బూజ, దోస పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. అరటి ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ తరుణంలో చాలా చోట్ల అరటిచెట్లు నేలకూలాయి. దీంతో అరటి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అలాగే మిరప, బొప్పాయి తోటలు కూడా గాలుల ధాటికి నేలకొరగడంతోపాటు కాయలన్నీ నేలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వ్యవసాయ పంటలకు సంబంధించి వరి, నువ్వు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, సజ్జ పంటలు కూడా దెబ్బతినడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

**దెబ్బతిన్న ఉద్యాన పంటల వివరాలు..**

జిల్లాలోని పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు, కొత్త నాగాయపల్లె, నందిమండలం, మాచనూరు, కొండూరు గ్రామాల్లో అరటి, కర్బూజ పంటలు దెబ్బతిన్నాయి. సీకేదిన్నె మండలం ఊటుకూరులో ఉల్లి పంట, చెన్నూరు మండలం గుర్రంపాడులో కర్బూజ, ముద్దనూరు మండలం బొందలకుంటలో అరటి, బొప్పాయి, లింగాల మండలం ఇప్పట్ల, లోపనూతల, గునకణపల్లె గ్రామాల్లో అరటి, బొప్పాయి, మిరప పంటలు, చాపాడు మండలం అల్లాడుపల్లె, చాపాడు, కదిరేపల్లి, కొత్తవరం, ఖాజీపేట మండలం చెమ్ములపల్లె, మైదుకూరు మండలం శివపురం గ్రామంలో కర్బూజ, చక్రాయపేట మండలం కె.రాజుపల్లె, కుప్పం, కుమ్మరకాల్వ, సురభి, చక్రాయపేట, మారెళ్లమడక, చిలేకాంపల్లి గ్రామాల్లో నిమ్మ, మామిడి పంటలు, వేంపల్లి మండలం పామలూరు, వేంపల్లి-1, వేంపల్లి-2, ఇడుపులపాయ1, 2, కత్తలూరు, వేంపల్లి-7, బక్కన్నగారిపల్లె గ్రామాల్లో మామిడి, తమలపాకు, మునగ, అరటి పంటలు, వీరపునాయనపల్లె మండలం యు.రాజుపాలెం, పాలగిరి గ్రామాల్లో అరటి, బత్తాయి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఇలా మొత్తంగా అన్ని మండలాల పరిధిలో 928 మంది రైతులకు సంబంధించి 886.85 హెక్టార్లలో పంటలు దెబ్బతిని రూ. 2 కోట్ల 14 లక్షల మేర ప్రాథమిక నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు.



కమలాపురం ప్రాంతంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

**535 హెక్టార్లలో దెబ్బతిన్న వ్యవసాయ పంటలు**

జిల్లాలో కురిసిన వర్షం, గాలుల ధాటికి 7 మండలాల పరిధిలోని 22 గ్రామాల్లో 535 హెక్టార్లలో వరి, పొద్దుతిరుగుడు, నువ్వు, కుసుమ, మినుము, మొక్కజొన్న, సజ్జలు పంటలు దెబ్బతిన్నాయి. ముద్దనూరు, చక్రాయపేట, పెండ్లిమర్రి, వల్లూరు, వీరపునాయునిపల్లె, సిద్ధవటం, వేంపల్లి మండలాల పరిధిలో 48 హెక్టార్లలో వరి, 43.2 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, 13 హెక్టార్లలో మినుము, 258.8 హెక్టార్లలో మొక్కజొన్న, 62 హెక్టార్లలో సజ్జలు, 102 హెక్టార్లలో నువ్వులు, 8 హెక్టార్లలో కుసుమ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు నష్టం అంచనాలను సిద్ధం చేశారు.

**పంటలను పరిశీలించిన వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు**

జిల్లాలో శనివారం రాత్రి కురిసిన వర్షం, గాలుల ధాటికి దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఉద్యానశాఖ అధికారి సుభాషిణితోపాటు ఏడీలు, వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పరిశీలించారు. ఈమేరకు ప్రాథమిక నష్టపరిహార అంచనాలను సిద్ధం చేశారు.

**జిల్లా అంతటా వర్షం**

జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి వర్షం కురిసింది. ఇందులో చెన్నూరు, జమ్మలమడుగులో 53.4 మిల్లీమీటర్ల అత్యధిక వర్షం కురవగా కలసపాడులో 3.2 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షం కురిసింది.

మండలం కురిసిన వర్షం(మి.మీ )

| | | | |
|---|---|---|---|
| చెన్నూరు | 53.4 | సీకేదిన్నె | 28.2 |
| జమ్మలమడుగు | 53.4 | వల్లూరు | 25.6 |
| ఖాజీపేట | 51.1 | ప్రొద్దుటూరు | 25.4 |
| మైదుకూరు | 48.2 | వీఎన్‌పల్లె | 21.0 |
| చాపాడు | 43.0 | బద్వేల్ | 17.4 |
| కమలాపురం | 37.4 | పెండ్లిమర్రి | 17.2 |
| వేంపల్లి | 35.2 | వేముల | 17.2 |
| ఎర్రగుంట్ల | 34.8 | బి.కొడూరు | 17.0 |
| రాజుపాలెం | 34.6 | కడప | 15.2 |
| ముద్దనూరు | 32.8 | తొండూరు | 12.2 |
| పెద్దముడియం | 31.8 | ఒంటిమిట్ట | 10.8 |
| కొండాపురం | 31.6 | అట్లూరు | 9.8 |
| మైలవరం | 30.0 | కాశినాయన | 5.2 |
| దువ్వూరు | 28.2 | కలసపాడు | 3.2 |

## జగనన్న విద్యాదీవెన పేదలకు వరం



మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు వెంకటసుబ్బయ్య, వి. బ్రహ్మయ్య

- జగనన్న విద్యాదీవెన లబ్ధి మొత్తాన్ని ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి
- జిల్లాలో 46,134 మంది విద్యార్థులకు రూ. 33.41 కోట్లు జమ

**కడప సిటీ:** 'పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఏ మాత్రం ఆర్థిక భారం కాకూడదు.. అదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.. అందుకే జగనన్న విద్యాదీవెన పథకం తీసుకొచ్చింది. ఇది పేదలకు వరం లాంటిది'.. అని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు వెంకటసుబ్బయ్య, వి. బ్రహ్మయ్య పేర్కొన్నారు.

- ఆదివారం ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ కేంద్రంలో బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ ద్వారా 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న లబ్ధి మొత్తాన్ని బటన్ నొక్కి అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.
- ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు వెంకటసుబ్బయ్య, వి.బ్రహ్మయ్య హాజరయ్యారు.

**జిల్లాలో 46,134 మందికి 33.41 కోట్లు**

ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 46,134 మంది విద్యార్థులకు మంజూరైన 'జగనన్న విద్యా దీవెన' లబ్ధి మొత్తం రూ. 33,41,00,888 ల మెగా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు గౌరవ అతిథుల ద్వారా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి స్థాయి ఫీజు రీఎంబర్స్‌మెంటు పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేయడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు.

**ఈ పథకం లేకుంటే చదువు ప్రశ్నార్థకమే**



నేను కడపలోని గీతాంజలి కాలేజీలో నవజీవన్ ఎమ్ఎల్‌టీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. మాది వ్యవసాయ కుటుంబం. పనులకు వెళితే గాని పూట గడవదు. ఈ పథకం లేకుంటే నా చదువు ప్రశ్నార్థకమే. - జి.ఓబులమ్మ, కునుకుంట్ల, అవుకు మండలం, కర్నూలు జిల్లా

**మాలాంటి విద్యార్థులకు వరం**



నేను కడపలోని విజయ స్కూలు ఆఫ్ నర్సింగ్ (జనరల్ నర్సింగ్) కళాశాలలో జీఎన్ఎం మొదటి సంవత్సరం చదువుతున్నాను. మాది వ్యవసాయ కుటుంబం. పంటలు పండకపోతే చదివించే పరిస్థితి కూడా ఉండదు. జగనన్న విద్యా దీవెన మాలాంటి విద్యార్థులకు వరం లాంటిది. - ఎస్.రెడ్డెమ్మ, నల్లచెరువుపల్లె, వేముల మండలం

## న్యూస్‌రీల్

**అడవుల సంరక్షణపై డ్రాయింగ్ పోటీలు**

**కడప ఎడ్యుకేషన్:** ఈనెల 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9 తరగతి విద్యార్థులకు అడవులు- ఆరోగ్యం అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ లింక్‌ను సామాజిక మాధ్యమాల ద్వారా అందుబాటులో ఉంచుతామన్నారు. వివరాలకు జిల్లా గ్రీన్ కోర్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి 9492378327 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

**26న పోలీస్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ సమావేశం**

**కడప అర్బన్:** దేవుని కడప పోలీసు డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల పరస్పర సహకార గృహ నిర్మాణ సంఘం మహాజన సభ ద్వితీయ అర్ధసంవత్సర (2022-2023) సమావేశం ఈనెల 26న ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ పోలీసు కాలనీ, కడప కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కె. ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

**ఉర్దూ విద్యాసంస్థలకు ఒంటిపూట బడి నిర్వహించాలి**

**కడప ఎడ్యుకేషన్:** ఈ నెల 23వ తేదీ నుంచి పవిత్రమైన రంజాన్‌మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ఉర్దూ మీడియం విద్యాసంస్థలకు ఒంటిపూట బడి నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని రూటా రాష్ట్ర అధ్యక్షుడు లయన్ ఇబాబ్‌బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్ అహ్మద్ ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు, టీచర్లు, సిబ్బంది అందరూ ఉపవాసం ఉంటారని అందువల్ల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని వారు సూచించారు.

**26న సాహితీ సదస్సు**

**కడప కల్చరల్:** నెలనెల రాయలసీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 26న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 118వ సదస్సుగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 1950 నుంచి 2000 సంవత్సరం వరకు రాయలసీమ సాంఘిక నాటకాలు అనే అంశంపై వైవీయూ తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి ఓబిలి వెంకటయ్య ప్రసంగించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం మాదే

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు
- నంద్యాల ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ఎన్నో అక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు

**కడప కార్పొరేషన్:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం వైఎస్సార్‌సీపీదేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక అపూర్వ ఫంక్షన్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించిందని, కేవలం 3 పట్టభద్రుల ఎన్నికల్లో మాత్రమే టీడీపీ రెండో ప్రాధాన్యత ఓట్లతో గట్టెక్కిందన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో తమ అభ్యర్థులే ముందంజలో ఉన్నారన్నారు. బీజేపీ, పీడీఎఫ్, వామపక్షాల ఓట్లన్నీ టీడీపీకి పడ్డాయన్నారు. దీనికే టీడీపీ నాయకులు చంకలు గుద్దుకోవడం హాస్యాస్పదమన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ విజయానికి తొలిమెట్టు అని ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకోవడం అవివేకమన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రజాబలం వైఎస్సార్‌సీపీ పక్షమున్నా అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ రూ.1500కోట్లు వెదజల్లి, దౌర్జన్యాలు, దాడులు చేసి గెలుపొందిందన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సంఖ్యాపరంగా వైఎస్సార్‌సీపీకే ఎక్కువ మెజార్టీ ఉన్నప్పటికీ ధనబలం, అంగబలం, అధికార బలాన్ని ఉపయోగించి ప్రలోభాలు పెట్టారన్నారు. తమ పార్టీ కార్పొరేటర్లపై దాడులు చేసి, మాట వినని వారిపై అక్రమ కేసులు నమోదు చేయించారని గుర్తు చేశారు. ఇన్ని అక్రమాలు చేసి వైఎస్ వివేకానందరెడ్డిని ఓడించారన్నారు. తెలుగు దేశం పార్టీలాగా తాము దౌర్జన్యాలు, అక్రమాలు చేయలేదన్నారు. అందుకే టీడీపీ విజయం సాధించగలిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామ రక్ష అని, 2024 ఎన్నికల్లో అవే తమను గెలిపిస్తాయన్నారు. అన్ని పార్టీలు ఏకమైనా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, మాజీ అధ్యక్షుడు జి. గరుడాద్రి, కార్పొరేటర్ ఆర్. చెన్నయ్య, ఆర్‌పీ రమణ, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాములోరి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

- వచ్చే నెల 5న పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న సీఎం
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తదితరులు

**ఒంటిమిట్ట(రాజంపేట):** జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వయంతో ఒంటిమిట్ట కోదండ రాముని బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బ్రహ్మోత్సవాల నిర్వహణపై స్థానిక టీటీడీ పరిపాలన భవనంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదండరాముని కళ్యాణం భక్తులు కనులారా వీక్షించేలా సదుపాయాలు కల్పించాలని సూచించారు.మార్చి 31 నాటికి కల్యాణోత్సవ ఏర్పాట్లు పూర్తికావాలన్నారు. కల్యాణ వేదిక వద్ద సీసీకెమెరాలు, బ్యారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెలాఖరులో మరోసారి పనుల పురోగతిపై సమీక్షించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 5న సీతారాముల కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తారన్నారు. వైఎస్సార్ జిల్లా కలెక్టరు విజయరామరాజు మాట్లాడుతూ కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందన్నారు. భద్రత, పార్కింగ్, పారిశుధ్యం, తాత్కలిక మరుగుదొడ్లు, నిరంతరం విద్యుత్ సరఫరా, వీఐపీ పాసులు,హెల్ప్‌డెస్కులు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాట్లకు సంబంధించి జిల్లా అధికారులతో పాటు టీటీడీలోని ఆయా విభాగాధిపతులతో కమిటీలు నియమించామన్నారు. వైఎస్సార్ జిల్లా ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ కల్యాణోత్సవానికి 4 వేల మందితో బందోబస్తును ఏర్పాటుచేస్తున్నామన్నారు. రెండు రోజుల ముందు నుంచే పోలీసులు విధుల్లో ఉంటారన్నారు.

**కల్యాణవేదిక పనుల పరిశీలన**

కలెక్టర్, ఈవో, ఎస్పీలు కల్యాణవేదిక వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ పనులు వేగవంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం ఈవో, కలెక్టరు ,ఎస్పీలు కోదండరామస్వామి ఆలయం, కల్యాణవేదికకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్, గైడ్‌లైన్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, ఓఎస్డీ రఘునాథ్, డ్వామా , డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనందనాయక్, డీఎస్పీ శివారెడ్డి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, ఎస్ఎస్ఏ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనువాసులరెడ్డి, డీటీసీ మీరాప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, టీటీడీ పీఆర్వో రవి,ఓఎస్డీ నగేష్, సమాచారశాఖ ఏడీ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎండీసీ పీడీ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడిని జయిస్తే విజయం పదిలం

- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- వైఎస్సార్ జిల్లాల్లో 146 పరీక్షా కేంద్రాలు
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టిన అధికారులు
- ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక



పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి విద్యార్థులు

**కడప ఎడ్యుకేషన్:** పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాలను సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించారు. విద్యార్థుల్లో సామర్థ్యాల మేరకు అత్యుత్తమ మార్కులు సాధించేలా పక్కాగా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. దీంతోపాటు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై మరింత శ్రద్ధ పెడుతున్నారు. పరీక్షలంటే విద్యార్థుల్లో టెన్షన్ ఉంటుంది. ఇందుకు అనుగుణంగా అధికారులు వారికి పరీక్షలపై అవగాహన కల్పిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తూ రోజువారి సమీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 03 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా సబ్జెక్టు నిపుణులతో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌తోపాటు రోజుకో పరీక్షను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. దీంతోపాటు విద్యావికాస నిపుణులతో పిల్లలకు ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ ఇప్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని అవగాహన కల్పిస్తున్నారు.

**వైఎస్సార్ జిల్లా పరిధిలో..**

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 146 పరీక్షా కేంద్రాల్లో 27,307 మంది రెగ్యులర్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షలను రాయనున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు కూడా నిద్రాహారాలను మాని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

**కీలకం కానున్న రివిజన్...**

విద్యార్థులు పరీక్షల సమయంలో తమకు రాని అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టి వచ్చిన వాటిని పట్టించుకోరు. ఇలా చేయడం వల్ల వచ్చిన అంశాలైనా కొన్ని రోజులకు మరిచిపోయే ప్రమాదం ఉంది. కనుక విద్యార్థులు వచ్చిన అంశాలను కూడా తరచూ రివిజన్ చేసుకుంటూ రాని విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అన్ని పాఠశాలల్లో పదవ తరగతికి సంబంధించి సిలబస్ పూర్తి కావడంతో రివిజన్ ఎంతో కీలకం అని విద్యా నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే పూర్తి స్థాయిలో నేర్చుకున్న అంశాల్లో మరింత పట్టు సాధించేలా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

**ఆరోగ్యంపైన...**

విద్యార్థులు పరీక్షల ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది, ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలు ఆత్మ విశ్వాసంతో పరీక్ష రాయగలరు. పిల్లలను బయటి ఆహారానికి దూరంగా ఉంచడంతోపాటు ముఖ్యంగా జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండటంతోపాటు చదువుపై ఆసక్తి కూడా పెరుగుతుంది. దీంతోపాటు సమయానికి నిద్రపోవడం అవసరం.

**మార్కుల సాధనకు నిపుణుల సూచనలు, సలహాలు...**

- సబ్జెక్టుల వారిగా టైం టేబుల్‌ను సిద్ధం చేసుకోవాలి. అన్ని సబ్జెక్టులు కవర్ అయ్యేలా చూసుకోవాలి.
- పాఠ్యాంశాలను పక్కాగా రివిజన్ చేసుకోవాలి.
- కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువగా సమయం కేటాయించాలి
- రివిజన్‌ల సమయంలో ముఖ్యమైన పాయింట్లను రాసుకోవాలి
- తోటి విద్యార్థులతో సబ్జెక్టులపై అప్పుడప్పుడు బృంద చర్చలు చేయాలి
- మోడల్ ప్రశ్నాపత్రాలు, పాత ప్రశ్నాపత్రాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి
- విరామం లేకుండా చదవడం మంచిదికాదు, మధ్యమధ్యలో బ్రేక్ తీసుకోవాలి.
- రోజుకు 6 గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి
- పరీక్షలంటే భయం వీడి పూర్తి పాజిటివ్ మైండ్‌తో ఉండాలి

| యాజమాన్యం | పాఠశాలలు | రెగ్యులర్ | ప్రైవేటు | మొత్తం |
|---|---|---|---|---|
| ఎయిడెడ్ | 25 | 868 | 110 | 978 |
| బీసీ వెల్ఫేర్ | 04 | 188 | 01 | 189 |
| గవర్నమెంట్ | 10 | 674 | 51 | 725 |
| కేజీబీవీ | 17 | 592 | 02 | 594 |
| మున్సిపాలిటీ | 17 | 1752 | 223 | 1975 |
| మోడల్ | 03 | 263 | 01 | 264 |
| ప్రైవేటు | 291 | 12363 | 212 | 12575 |
| ఏపీఆర్ఎస్ | 03 | 159 | 01 | 160 |
| సోషల్ వెల్ఫేర్ | 13 | 835 | 11 | 846 |
| ట్రైబల్ వెల్ఫేర్ | 05 | 104 | 04 | 108 |
| జెడ్పీ | 202 | 9509 | 457 | 9966 |
| మొత్తం | 589 | 27307 | 1073 | 28380 |

**మెరుగైన ఫలితాలకు కృషి..**



ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం. పరీక్షలంటే భయపడకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయా సబ్జెక్టు టీచర్లకు సూచించాం. - ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

## క్లుప్తంగా

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే అజెండా

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి**



పీఎస్‌టీయూ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఎన్నికల ప్రచార సమయంలో తాను చేసిన వాగ్దానాలు, మేనిఫెస్టోలో పెట్టిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే అజెండాగా పనిచేస్తానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి అన్నారు. ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం కడపలోని సాయిబాబా హైస్కూల్‌లో జిల్లా అధ్యక్షుడు పి.వి. సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే మోడల్ స్కూల్స్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు వచ్చేలా చూస్తానన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ వచ్చేలా, కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని చెప్పారు. పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ వెంటనే మూడు డీఏలు ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర సహ అధ్యక్షుడు బి.సి. రెడ్డెన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వి సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శి బోగా వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మునిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్‌హక్, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, జక్రియబాషా తదితరులు పాల్గొన్నారు.

# మహావీర్ మ్యూజియానికి మంచి రోజులు

- ఆమోదం కోసం మైలవరం మ్యూజియం డీపీఆర్
- విశాఖలో వైఎస్సార్ పేరిట స్టేట్ మ్యూజియం
- జిల్లాలోని శాసనాలకు లభించనున్న రక్షణ





మహావీర్ మ్యూజియం



మ్యూజియం ఆవరణలో చెల్లాచెదురుగా శిల్పాలు

కడప కల్చరల్ : కడప నగరంలోని భగవాన్ మహావీర్ మ్యూజియంకు మంచిరోజులు రానున్నాయి. దాంతోపాటు జమ్మలమడుగు సమీపాన గల మైలవరం రిజర్వాయర్ వద్దనున్న మ్యూజియంకు కూడా మహర్దశ పట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర పురావస్తుశాఖ ప్రయత్నాలు చేస్తోంది. శిథిల భవనాలలో నడుస్తున్న మ్యూజియంలకు కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. తొలిదశలో కడప నగరంలోని మహావీర్ మ్యూజియం, అనంతరం మైలవరం మ్యూజియంలకు శిథిల భవనాల స్థానంలో నూతన భవనాలు రానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకతలు గల శిల్పాలు, శాసనాలు, పురాతన వస్తువులతో విశాఖపట్టణంలో వైఎస్సార్ స్టేట్ మ్యూజియంను నిర్మించనున్నారు.

**41 ఏళ్ల క్రితం నిర్మాణం**

కడప మహావీర్ మ్యూజియం గురించి జిల్లా వాసులందరికీ తెలిసిందే. 41 ఏళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నగరంలోని కలెక్టరేట్ సర్కిల్‌లో స్థానిక జైనుల సహకారంతో మ్యూజియం నిర్మించారు. జైనులు తమ ఆరాధ్యదైవమైన భగవాన్ మహావీరుని పేరిట ఈ మ్యూజియాన్ని నిర్మింపజేశారు. నాటి ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ భవనాన్ని ప్రారంభించగా, పురావస్తుశాఖ మంత్రి పి.జనార్దన్‌రెడ్డి శిల్పశాసన విభాగాన్ని ప్రారంభించారు. గండికోట ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆ ప్రాంతంలో లభించిన శిల్పాలు, శాసనాలు, జిల్లాలోని ఇతర ప్రాంతాలలో లభించిన అన్నింటినీ ఈ మ్యూజియంకు చేర్చారు. ఇందులో పదుల సంఖ్యలో అరుదైన శాసనాలు దాదాపు 100కు పైగా విభిన్న శిల్పకళాశైలిని తెలిపే శిల్పాలు, పురాతన ఖడ్గాలు, వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. 15 ఏళ్లపాటు మ్యూజియం సందర్శకులతో కళకళలాడింది. కాలానుగుణ మార్పులు, కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో సందర్శకుల సంఖ్య తగ్గింది. భవనం పూర్తిగా దెబ్బతినింది. వర్షం వస్తే పైకప్పు పూర్తిగా నీరు కారుతూ తడిచి ఏ క్షణాన కూలిపోతుందోనన్న భయం గొల్పుతోంది. అడపాదడపా వచ్చిన సందర్శకులపై పైకప్పు గచ్చులు ఊడిపడుతుండడంతో వారి రాక పూర్తిగా తగ్గిపోయింది. సాక్షాత్తు ఓ కలెక్టరే దానిని బూత్‌బంగ్లాగా అభివర్ణించారు. ఓ ఉద్యోగి మినహా అందులో ఎవరూ ఉండడం లేదు. ఇటీవల నూతన కలెక్టరేట్ నిర్మాణ సమయంలో వెలుపలి వైపు పూర్తిగా గోడ కట్టేడంతో మ్యూజియం పూర్తిగా కనపడటం లేదు.

**కొత్త భవనం అవకాశం**

రాష్ట్రంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో నడుస్తూ శిథిల స్థితికి చేరుకున్న మ్యూజియంలకు కొత్త భవనాలను నిర్మించేందుకు ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సందర్శకులకు శిల్పాలు, శాసనాలు స్పష్టంగా కనిపించేలా పూర్తి స్థాయి రక్షణతో వీటిని నిర్మించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని ఇటీవల రాష్ట్ర పురావస్తుశాఖ కమిషనర్ జి.వాణీమోహన్ ప్రకటించారు. ఇందులో భాగంగా కడప నగరంలోని మహావీర్ మ్యూజియం నూతన భవన నిర్మాణాలకు రూ.10 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని మైలవరం మ్యూజియానికి కూడా నూతన భవనాలు కావాలంటూ స్థానిక పురావస్తుశాఖ అధికారులు కోరడంతో సంబంధిత అధికారులు దాన్ని కూడా పునర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

**శాసనాల రక్షణ కోసం ప్రత్యేక మ్యూజియం**

ఉభయ తెలుగు రాష్ట్రాలలో మరెక్కడా లేనన్ని శాసనాలు కేవలం మన రాష్ట్రంలో ముఖ్యంగా వైఎస్సార్ జిల్లాలో లభించాయన్న విషయం తెలిసిందే. తొలి తెలుగు శాసనమైన కలమల్ల శాసనం కూడా మన జిల్లాలోనే లభించింది. రెండో శాసనం సమీపంలోని ఎర్రగుడిపాడులో వెలుగు చూసింది. ఇంకా కేవలం తెలుగు శాసనాలే కాకుండా అరబ్బీ, ఉర్దూ, ఆంగ్ల శాసనాలు కూడా జిల్లాలో లభించినట్లు తెలుస్తోంది. గండికోటలోనూ, లోయ గ్రామాలలోనూ దాదాపు 1000 శాసనాలు ఉన్నట్లు ఆ శాఖ నిపుణులు తెలుపుతున్నారు. రక్షణ లభించకపోవడంతో చరిత్రకు సాక్షాలుగా నిలిచి ఉన్న ఇలాంటి విలువైన వారసత్వ సంపద కళ్లముందే శిథిలమై పోతుండటం పట్ల పలువురు చరిత్రకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి శాసనాలను రక్షించడం కోసం రాష్ట్ర పురావస్తుశాఖ ప్రత్యేకంగా శాసన పరిరక్షణ కోసమే శాసన మ్యూజియం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రారంభమైంది. ఆ మ్యూజియం అందుబాటులోకి వస్తే మన జిల్లాలోని విలువైన శాసనాలకు శాశ్వతంగా రక్షణ లభించే అవకాశం ఉంది.

### గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గుర్తు తెలియని వృద్ధుడు (70) ఈ నెల 15న చికిత్స కోసం చేరాడు. కార్డియో పల్మనరీతో బాధపడుతూ ఈ నెల 18న మృతి చెందాడు. అతని వద్ద వున్న ఆధార్ కార్డు ప్రకారం.. చాపాడు మండలం చియ్యపాడుకు చెందిన నల్లోలి తిరుపాలు (70)గా గుర్తించారు. అతని బంధువులు ఎవరైనా వుంటే మృతదేహం కోసం తమను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు ఆదివారం తెలియజేశారు.

### ఆటో, వ్యాన్ ఢీ.. ఒకరికి గాయాలు

రాజంపేట : పట్టణ శివారులోని మునక్కాయపల్లె క్రాస్ వద్ద శనివారం రాత్రి మినీవ్యాన్, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నందలూరు మండలం అరవపల్లెకు చెందిన మహమ్మద్‌రఫీకి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కడపకు తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

## అత్తపై హత్యాయత్నానికి పాల్పడిన అల్లుడి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ సిద్దయ్య

కడప అర్బన్ : అత్తపై హత్యాయత్నానికి పాల్పడిన అల్లుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి ఏడు రోడ్ల కూడలి సమీపంలోని పల్లాభాస్కర్ హాస్పిటల్ సమీపంలో శనివారం పాతకడపకు చెందిన మున్నెల బాల గుర్రయ్య తన అత్త ఓబుళమ్మపై కత్తితో దాడి చేశాడు. ఆమె గాయాల పాలై కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఎన్‌వీ నాగరాజు ఆదేశాల మేరకు ఎస్‌ఐ సిద్దయ్య తమ సిబ్బందితో కలిసి హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుడు బాలగుర్రయ్యను ఆదివారం రాయల్ థియేటర్ సమీపంలో ఎస్‌ఐ సిద్దయ్య, హెడ్‌కానిస్టేబుల్ అంజి నాయక్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు.

### ఆటో డ్రైవర్ నిజాయితీ

జమ్మలమడుగు రూరల్ : ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. జమ్మలమడుగుకు చెందిన కటారీ సుజాత అనే ప్రయాణికురాలు సొంత పనుల నిమిత్తం మహమ్మద్ రఫీ అనే వ్యక్తి ఆటోలో ఆదివారం ప్రయాణించింది. ఆమె తన పర్సులో ఉన్న రూ.6320 ఆటోలో పెట్టి మరచిపోయింది. గమనించిన ఆటో డ్రైవర్ వెంటనే జమ్మలమడుగు పట్టణ పోలీస్‌స్టేషన్ చేరుకుని ఎస్‌ఐ సుబ్బారావును కలిసి ఆ పర్సును అప్పగించాడు. కాసేపటికి సుజాత గుర్తించి కటారీ నాగమునేంద్రకు చెప్పడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆటో డ్రైవర్ ఇచ్చిన డబ్బులను కటారీ నాగ మునేంద్రకు ఎస్‌ఐ అప్పగించారు. దీంతో ఎస్‌ఐ ఆటో డ్రైవర్ నిజాయితీని మెచ్చుకొని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్‌ను సత్కరిస్తున్న ఎస్‌ఐ, పోలీసు

## సిద్దయ్య మఠం ఉత్సవాలకు ముస్తాబు

- 22న పెద్దపీరయ్యస్వామి ఆరాధన
- భక్తుల దర్శనార్థం బ్రహ్మంగారి కానుకలు



ముడుమాలలోని సిద్దయ్యస్వామి మఠం



బ్రహ్మంగారు నాడు సిద్దయ్యకు ఇచ్చిన కానుకలు

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియ శిష్యుడు సిద్దయ్యస్వామి కొలువైన మఠం ఉత్సవాలకు ముస్తాబు అవుతోంది. మండలంలోని ముడుమాలలో ఈ మఠం ఉంది. సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం పెద్దపీరయ్యస్వామికి పూల పూజ, ప్రత్యేక వస్త్రాలంకరణ కార్యక్రమాలు చేపడతారు. రాత్రి గ్రామోత్సవం, భజనలు, డ్రామాలు, అన్నదానాలు ఉంటాయి.

**బండలాగుడు పోటీలు**

గురువారం మహాప్రసాద వినియోగం ఉంటుంది. బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఉదయం చిన్న బండలాగుడు పోటీలు ఉంటాయి. మొదటి, రెండు, మూడు, నాలుగు బహుమతులు వరుసగా రూ.30,016, రూ.20,016, రూ.15,016, రూ.5,016 ఇవ్వనున్నారు. మధ్యాహ్నం పెద్దబండ పోటీలు ఉంటాయి. మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదవ బహుమతులు వరుసగా రూ.75,016, రూ.50,016, రూ.30,016, రూ.15,116, రూ.10,116 ఇస్తారు. మనుముల గుండు ఎత్తే పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

**ఉగాది సందర్భంగా..**


శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆనాడు సిద్దయ్యకు ఇచ్చిన గురుకానుకలను భక్తుల దర్శనం కోసం ఉంచనున్నారు. శిఖాముద్రిక, యోగదండన, తాళ్ళపత్రాలు, పాదుకలను ఉగాది సందర్భంగా బుధవారం భక్తుల దర్శనం కోసం ఉంచుతారు. వాటిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఉత్సవాల కోసం మఠాధిపతులు, శిష్యబృందం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



### 'ఇది ప్రజా వ్యతిరేకతగా భావించలేం'

కడప కార్పొరేషన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రజా వ్యతిరేకత వల్లే టీడీపీ గెలిచిందని చెప్పలేమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు గుండ్లపల్లి గరుడాద్రి అన్నారు. ఆదివారం నగరంలోని వారి కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వామపక్షాలు, పీడీఎఫ్‌కు చెందిన ఓట్లు కూడా టీడీపీకి పడటం వల్లే రెండో ప్రాధాన్యత ఓట్లతో ఆ పార్టీ గట్టెక్కిందన్నారు. ఇది వాపే తప్పా బలుపు కాదన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీపై పట్టభద్రులు తిరుగుబాటు చేశారని చెప్పడం సరైంది కాదన్నారు. తెలుగుదేశం పార్టీ మూడు ఎమ్మెల్సీ సీట్లు గెలిచినందుకే ఎల్లోమీడియా ఆకాశానికి ఎత్తేస్తూ మితిమీరిన ప్రచారం చేయడం విచిత్రంగా ఉందన్నారు.

### పిడుగుపాటుకు ఆవు మృతి



మృతి చెందిన ఆవు, దూడను పరిశీలిస్తున్న పశు వైద్యులు

చిట్వేలి : రాజుకుంట పంచాయతీలోని చింతల చెలిక గ్రామంలో శుక్రవారం రాత్రి 8.45 గంటల సమయంలో పిడుగు పడగా వంకర శంకరయ్యకు చెందిన ఆవు, దూడ మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న పశు వైద్యులు భువనేశ్వరీ, ఆర్‌ఐ శేషంరాజు, వీఆర్‌ఓ రఘుపతి శనివారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ భువనేశ్వరీ మాట్లాడుతూ సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించి రైతుకు నష్టపరిహారం మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు నారాయణ, నరసింహులు పాల్గొన్నారు.